'పోలీసులు ప్రజలకు స్నేహితులు'

గోల్కొండ: పోలీసులు ప్రజలకు స్నేహితులు అని టోలిచౌకీ ఇన్స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన అజీజ్‌బాగ్‌లోని పోలీస్‌స్టేషన్ నుంచి సమతా కాలనీ, టూంబ్స్ చౌరస్తా, అజీజ్‌బాగ్‌ల మీదుగా పోలీసులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ..శాంతిభద్రతలు మరింత పటిష్టంగా కాపాడేందుకు టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అయిందన్నారు. ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ ఫిర్యాదులు ఇవ్వవచ్చునన్నారు. అదే విధంగా డ్రగ్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ అనుసరిస్తున్న విధానాన్ని పటిష్టంగా అమలు పరుస్తామన్నారు. కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల వారు తమతమ సలహాలు, సూచనలను నేరుగా తన వద్దకు వచ్చి ఇవ్వవచ్చునన్నారు.

'నిబంధనలు సడలించి రుణాలు ఇవ్వాలి'

చాంద్రాయణగుట్ట: రాజీవ్ యువ వికాసం పథకంలో ఇష్టానుసారంగా కొర్రీలు పెట్టి గందరగోళాన్ని సృష్టించడం సరికాదని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చామని ప్రభుత్వం ఆర్భాటంగా పేర్కొందన్నారు. కానీ సిబిల్ స్కోర్ నిబంధన అంటూ దరఖాస్తుదారులను తిరస్కరిస్తున్నారన్నారు. బ్యాంక్‌లు సైతం రుణాలు ఇచ్చేందుకు వెనుకంజవేస్తున్నాయన్నారు. నిబంధనలను సడలించి రుణాలు ఇవ్వాలని కోరారు.

అన్నదానం



అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మన్నె శ్రీధర్ రావు

నాంపల్లి: మానవ సేవయే మాధవ సేవ అని ద నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు అన్నారు. రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రి వద్ద అంబేడ్కర్ సేన ఆధ్వర్యంలో పేద రోగులు, రోగి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మన్నె శ్రీధర్ రావు హాజరై అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ద నేషనల్ అంబేడ్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజేష్, ప్రధాన కార్యదర్శి శాతిరి ప్రవీణ్‌కుమార్, నాంపల్లి నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ అషూ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

బంజారాహిల్స్: రోడ్డుకు అడ్డంగా బైక్‌లు ఎందుకు పార్కింగ్ చేశారంటూ ప్రశ్నించిన ఓ యువకుడిపై ఆరుగురు ఆగంతకులు దాడి చేసి గాయపర్చిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–2లోని ఇందిరానగర్‌లో ఉండే జొల్లు అరుణ్‌కుమార్, ఆయన బావమరిది సాయిరాం ఇద్దరూ కలిసి తెల్లవారుజామున టీ తాగడానికి కృష్ణానగర్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా మూడు బైక్‌లు అక్రమంగా పార్కింగ్ చేసి ఉన్నాయి. ఇలా ఎందుకు పార్కింగ్ చేశారంటూ అరుణ్‌కుమార్, సాయిరాం ప్రశ్నించారు. ఆగ్రహంతో ఊగిపోయిన ఆరుగురు ఆగంతకులు సాయిరాంను తీవ్రంగా కొట్టడమే కాకుండా కత్తితో మెడ, చేయిపై పొడిచారు. అడ్డుకునే క్రమంలో ఛాతిపై కూడా గట్టిగా పొడవడంతో సాయిరాంకు తీవ్ర గాయాలయ్యాయి. తన బావమరిదిని హత్య చేసే ఉద్దేశ్యంతోనే ఆగంతకులు బైక్‌లు అడ్డంపెట్టి గొడవకు దిగి కత్తితో పొడిచారని అరుణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స నిమిత్తం సాయిరాంను ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దాడి చేసిన వారి కోసం గాలింపు చేపట్టారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాడి వలలో చార్టడ్ అకౌంటెంట్

బంజారాహిల్స్: వదిన డీపీతో ఉన్న వాట్సాప్ నంబర్ నుంచి వచ్చిన సందేశాన్ని నమ్మిన ఓ చార్టర్డ్ అకౌంటెంట్ రూ.75 వేలు బదిలీ చేసి మోసపోయాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-5లోని శీతల్ ఎన్‌క్లేవ్‌లో చార్టర్డ్ అకౌంటెంట్ రాయప్రోలు వెంకట రమేష్ నివాసం ఉంటున్నాడు. ఈ నెల 3వ తేదీన ఉదయం తన వదిన డీపీతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. డీపీ ఆధారంగా అమెరికాలో ఉండే తన వదినగానే భావించి ఆ వాట్సప్ మెసేజ్‌కు స్పందించాడు. యూపీఐ ద్వారా రూ.50 వేలు బదిలీ చేశాడు. మూడు గంటల తర్వాత మరో రూ.25 వేలు ట్రాన్స్‌ఫర్ చేయాల్సిందిగా అభ్యర్థన రావడంతో పంపించాడు. తన వదిన పేరిట ఎవరో ఆన్‌లైన్ మోసానికి పాల్పడ్డారని గ్రహించాడు. న్యాయం చేయాల్సిందిగా బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన హెరిటేజ్ వాక్



మదీనా సర్కిల్లో ఏర్పాటు చేసిన ముత్యపు చిప్ప డిజైన్

చార్మినార్: పాతబస్తీలో నిర్వహించిన హెరిటేజ్ వాక్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా గత వారం రోజుల నుంచి ఏర్పాట్లలో నిమగ్నమైన ప్రభుత్వ విభాగాల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ స్వయంగా భద్రత ఏర్పాట్లతోపాటు భారీ బందోబస్తును పర్యవేక్షించారు. దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రాతో పాటు పలువురు ఐపీఎస్ అధికారులు నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎప్పటికప్పుడు శాంతి భద్రతలను పరిశీలించారు. ఈనెల 11న భారీ బందోబస్తు నడుమ మిస్ వరల్డ్ రిహార్సల్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రపంచ సుందరంగులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో హెరిటేజ్ వాట్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఎంపిక చేసిన గాజుల దుకాణాల్లో మిస్ వరల్డ్ పోటీదారులు సందడి చేశారు. నిజాం కాలం నాటి చారిత్రాత్మకమైన కట్టడాల విశేషాలను హెరిటేజ్ వాక్ సందర్భంగా సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రపంచ సుందరాంగులకు వివరించారు. పోలీసులతో పాటు జీహెచ్ఎంసీ, టీఎస్ఎస్పీడీసీఎల్, పర్యాటక శాఖ, ఆర్కియాలజీ విభాగం, సమాచార, పౌర సంబంధాల శాఖ, ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది..ఇలా ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది వారం పది రోజులుగా చేసిన కృషితో హెరిటేజ్ వాక్ కార్యక్రమం విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సహకరించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.



మిస్ వరల్డ్ పోటీదారుల రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు



ఫొటోలు, వీడియోల కోసం పోటీపడుతున్న ప్రజలు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ జిల్లా అబ్జర్వర్ సురేశ్ కుమార్ జీ, సి.సుబ్రహ్మణ్యం ప్రసాద్ జీ, యాకుత్‌పురా కంటెస్టెడ్ ఎమ్మెల్యే కె.రవి రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, బ్లాక్ ప్రెసిడెంట్ల ఎంపిక కోసం నాయకుల అభిప్రాయాలను సేకరించారు. కాంగ్రెస్ పార్టీని పాతబస్తీలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి అల్లం భాస్కర్, కంటెస్టెడ్ కార్పొరేటర్ మీర్జా ఆలం బేగ్, బ్లాక్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాస్, సంతోష్‌నగర్ డివిజన్ అధ్యక్షులు అల్లం భాస్కర్, ఫిరోజ్, మల్లికార్జున్, నూర్‌తో పాటు సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో జీహెచ్‌ఎంసీ అనుమతులు

ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ శాఖ నోటీసులు



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11లోని ఇంటికి నోటీసులు అంటించిన దృశ్యం

బంజారాహిల్స్: షేక్‌పేట మండల పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్డు నంబర్–11లోని మిథిలానగర్ కాలనీలో జీహెచ్ఎంసీ నుంచి భవన నిర్మాణ అనుమతులు తీసుకుని ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్ వేసిన వ్యవహారంపై రెవెన్యూ శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. వేరే స్థలానికి చెందిన డాక్యుమెంట్లను చూపి ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలకు పాల్పడ్డారంటూ స్థల యజమానులు గున్నా జైదీప్‌రెడ్డి, గున్నా సందీప్‌రెడ్డి తదితరులకు మంగళవారం సెక్షన్-7 ఆఫ్ ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్ కింద షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. శివరాజ్ ఠాకూర్ అనే బిల్డర్ పేరుతో జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకున్న ప్రాంతం రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 403లోని టీఎస్-నంబర్ 2, వార్డు–11, బ్లాక్–ఎస్‌లోకి వస్తుందని, టీఎస్ఎల్ఆర్ ప్రకారం ఈ స్థలం మొత్తం ప్రభుత్వానిదేనని ఇప్పటికే గుర్తించిన షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు స్థలంలో ఉన్న 700 గజాల విస్తీర్ణంలోని భవనంతో పాటు నాలా వైపు ఉన్న 250 గజాల స్థలం మొత్తం ప్రభుత్వానిదేనని నిర్ధారించి నోటీసులు జారీ చేశారు. టీఎస్ నంబర్ 29, బ్లాక్–ఓ, వార్డు–11లో ఉన్న స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపించి జీహెచ్ఎంసీ నుంచి అనుమతి తీసుకున్నారని, అక్కడ కాకుండా ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలో ఉన్నందున వారం రోజుల్లోగా ఆక్రమణలను ఎందుకు తొలగించరాదో చెప్పాలని నోటీసులో ప్రశ్నించారు. వారం రోజుల్లో ఆక్రమణలు తొలగించకపోతే తామే వాటిని తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గోల్కొండ: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ అన్నారు. మంగళవారం కార్వాన్ ఆర్యసమాజ్ భవన్‌లో అడ్వాన్స్‌డ్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ.. లాభాపేక్ష దృష్టితో కాకుండా సేవా దృక్పథంతో కార్పొరేట్ ఆసుపత్రులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్‌కుమార్, చెన్నోజి నర్సింహచారి, మధుముదిరాజ్ తదితరులున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు నిత్యం మానిటరింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో గల్లీ గల్లీ తిరుగుతూ శానిటేషన్ సిబ్బందితో పాటు మహిళా సమాఖ్యల ప్రతినిధులు అవగాహన కల్పిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరా నగర్, జవహర్‌కాలనీ, కమలాపురి కాలనీల్లో శానిటేషన్ సిబ్బందితో పాటు మహిళా సమాఖ్యల ప్రతినిధులు చెత్త సేకరించే వాహనదారుడితో కలిసి మైక్ సెట్ పట్టుకొని మంగళవారం అవగాహన కల్పించారు. చెత్త బండికి చెత్త ఇవ్వకుండా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.500 జరిమానా విధిస్తామంటూ అవగాహన కల్పించారు.



బీజేపీ డివిజన్ అధ్యక్షుల నియామకం

చార్మినార్: గోల్కొండ జిల్లా పరిధిలోని చార్మినార్, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన బీజేపీ డివిజన్ అధ్యక్షులను కొత్తగా నియమించారని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి. ఉమా మహేందర్ తెలిపారు. చార్మినార్ శాసనసభ నియోజకవర్గంలోని ఘాన్సీ బజార్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నితీష్ అగర్వాల్‌ను నియమించడంతో పాటు పురానాపూల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా కే.ప్రకాష్‌ను నియమించామన్నారు. అలాగే కార్వాన్ శాసన సభ నియోజకవర్గంలోని నానల్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా బాలాజీ, టోలిచౌకి బీజేపీ అధ్యక్షుడిగా బొమ్మల శ్రీకాంత్‌ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ పూజలు

జియాగూడ: ఎల్లమ్మ పూజలు ఆధ్యాత్మిక పెంపొందిస్తుందని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ బీజేపీ కార్వాన్ కో కన్వీనర్ శివకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన పూజలకు ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ, వెంకటేష్‌యాదవ్, రమేష్ చౌగ్లే, ఇంద్రసేన రెడ్డి, ఆకుల గోవర్ధన్, కాంతిలాల్, డిజ్వర్ సింగ్, రామ్‌కుమార్, జగదీష్, ఉదయ్‌కుమార్, వినేష్ సింగ్, నాగేందర్, ప్రకాష్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడువుతీరిన చైల్డ్ కిట్ అందజేత.. కేసు నమోదు

గోల్కొండ: గడువుతీరిన చైల్డ్ కేర్ కిట్‌ను పంపిణీ చేసిన ఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..ముస్కాన్ శర్మ అనే మహిళ గత వారం ప్రసవం కోసం గోల్కొండ ఆసుపత్రిలో అడ్మిట్ అయింది. కాగా ఈ నెల 7న ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. మంగళవారం ఆమెను డిశ్చార్జ్ చేశారు. ఈ సమయంలో ఆమెకు ఆసుపత్రి వారు నవజాత శిశువు కోసం చైల్డ్ కేర్ కిట్‌ను అందించారు. అయితే ఆ కిట్‌లో గడువు తీరిన బేబీ ఆయిల్ ట్యూబ్ ఉండడం ముస్కాన్‌శర్మ భర్త రాహుల్ శర్మ గమనించాడు. ఈ విషయంపై రాహుల్‌శర్మ మంగళవారం సాయంత్రం గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

నాంపల్లి: ద్విచక్ర వాహనం ఢీకొని మరో ద్విచక్ర వాహనదారుడికి గాయాలైయిన ఘటన మాసబ్ ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..పటేల్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్, కవిత దంపతుల కుమారుడు సత్యం శ్రీవాత్సవ్ మెహిదీపట్నం నుంచి లక్డీకాపూల్ వైపు వెళ్తున్నాడు. మాసబ్ ట్యాంక్ సిగ్నల్ వద్దకు చేరుకోగానే బంజారాహిల్స్ రోడ్ నంబరు-1 నుంచి మల్లేపల్లి వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనాన్ని వేగంగా సిగ్నల్‌ను జంపు చేసి సత్యం శ్రీవాత్సవ్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో క్షతగాత్రుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలపాలైన సత్యం శ్రీవాత్సవ్‌ను చికిత్స నిమిత్తం కాచిగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల సంక్షేమం



డాక్టర్ అనిల్ జైహింద్‌ను సన్మానిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల సంక్షేమం కొనసాగుతుందని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణలో పేద బడుగు వర్గాల సంక్షేమం సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో కొనసాగుతుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. మంగళవారం నూతనంగా ఎన్నికైన ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ అనిల్ జైహింద్‌ను నిర్మల్‌కుమార్ యాదవ్ ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంతో పాటు అన్ని ప్రాంతాల్లో పేదలకు సన్న బియ్యం ఇస్తున్న ఘనత తమ పార్టీదేనన్నారు. అన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంటే తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు ఇష్టారాజ్యాంగా మాట్లాడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

చాంద్రాయణగుట్ట: కార్మిక చట్టాల అమలు డిమాండ్‌పై మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ విజ్ఞప్తి చేశారు. సమ్మెలో పాల్గొనే ఆశా వర్కర్ల విషయమై బార్కాస్ క్లస్టర్ వైద్యాధికారిణికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లకు సరైన వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంకుమార్, హారిక, యాస్మిన్, సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

విజయనగర్‌కాలనీ: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ ఎంట్రెన్స్–2025 టెస్ట్ ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ జిల్లాలో మాసబ్‌ట్యాంక్ కో ఆర్డినేటర్ పరిధిలోని 9 పరీక్షా కేంద్రాల్లో 3,406 మంది విద్యార్థులకు గాను 3,018 మంది హాజరైయినట్లు మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులను నిర్ణీత సమయానికి ఒక గంట ముందు నుంచి అనుమతించారు. నిమిషం నిబంధన కచ్చితంగా అమలు చేయడంతో నిర్ణీత సమయం దాటిన తర్వాత విద్యార్థులను అనుమతించలేదు. ఈ ఎంట్రెన్స్ టెస్టును స్పెషల్ అబ్జర్వర్ రమణ ప్రసాద్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ కె.హరికృష్ణలతో పాటు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

శ్మశానవాటికల స్థలాలను కాపాడుతాం



శ్మశానవాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: శ్మశానవాటికల స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడుతామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వినాయకనగర ప్రాంతంలో శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురవుతుందని వడ్డెర సంఘం సభ్యు లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రహరీ, వెయిటింగ్ హాల్, బోర్, తాగునీరు, టాయిలెట్స్ తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సంపంగి నర్సింహ, బాలరాజు, శ్రీను, బోధస్ హరికృష్ణ, శ్రీను, రాజు, ప్రసాద్, సురేశ్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ను శంకర్‌రెడ్డి, దండుగుల ప్రసాద్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



పుత్లీబౌలి చౌరస్తాలో పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: ఆపరేషన్ సిందూర్ పేరిట ప్రపంచ దేశాలకు భారతదేశ సత్తాను ప్రధాని నరేంద్రమోదీ చాటిచెప్పారని మంగళవారం జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో పుత్లీబౌలి చౌరస్తాలో ఆయన ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ..ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్ ఉగ్రవాదులపై చేసిన దాడిని యావత్ ప్రపంచం స్వాగతించిందన్నారు. పాకిస్తాన్ ఎన్ని ప్రతీకార దాడులు చేసినా తిప్పికొట్టి భారత్‌ను ఏ దేశం ఏమీ చేయలేదని నరేంద్ర మోదీ నిరూపించారన్నారు. భారత సైన్యం ధైర్య సహసాలను ప్రతి భారతీయుడు ఎంతో గర్వించారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, రాజేందర్ జైస్వాల్, సందీప్ జైన్, బాలాజీ, శ్రీకాంత్, బాల్‌రాజ్, చందర్, శివ కుమార్, రవి, మహేష్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ లాల్‌సింగ్

అబిడ్స్: యువత, విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తనవంతు కృషి చేస్తానని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం గోషామహల్ ప్రాంతంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లాల్ సింగ్ మాట్లాడుతూ..క్రీడాకారుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి ముందుంటానన్నారు. క్రీడా మైదానాల్లో ప్రభుత్వం మరింత అభివృద్ధి పరచాలన్నారు. క్రీడా సంక్షేమానికి జీహెచ్ఎంసీ ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహా, అమర్‌దీప్ సింగ్, సందీప్ సింగ్, రోహిత్ జవహరి తదితరులు పాల్గొన్నారు.

ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు ఘన నివాళి

అబిడ్స్: మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా, రాష్ట్ర నాయకులు కుమార్‌రావు, భాస్కర్‌రావు, వెంకట్‌రామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్‌రావు ఫక్రుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనిలాల్ షా మాట్లాడుతూ..దేశ శ్రేయస్సుకు ఫక్రుద్దీన్ అహ్మద్ ఎంతో కృషి చేశారని కొనియాడారు.



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా తదితరులు

కార్వాన్ నియోజకవర్గంలో పర్యటించాలి



టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పర్యటించాలని టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీను ఎమ్మెల్యే ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే ఆయనను కలిసి నియోజకవర్గంలో ఉన్న విద్యుత్ సమస్యలను వివరించారు. దశాబ్దాల క్రితం వేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయని వాటిని మార్చాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో పలుమార్లు మంటలు లేసి కాలిపోతున్నాయని క్రమం తప్పకుండా వీటిని పరిశీలించకపోవడం వల్లే ఈ విధంగా జరుగుతుందన్నారు. అదే విధంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై తాను గతంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అవి ఇప్పటి వరకు మంజూరు కాలేదన్నారు. ఈ విషయాలపై సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ముషరఫ్ ఫారూఖీ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.